క్లుప్తంగా

నేత్రపర్వంగా వేగిలింగేశ్వరుని రథోత్సవం



అనంతపల్లిలో వేగిలింగేశ్వరస్వామి రథోత్సవం

నల్లజర్ల: అనంతపల్లిలో వేంగీరాజుల చారిత్రిక కట్టడాలకు నిలయమైన బాలాత్రిపుర సుందరీ సమేత వేగిలింగేశ్వరస్వామివారి రథోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా అదే రోజు రాత్రి స్వామి, అమ్మవార్లను పూలతో అలంకరించిన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ఊరేగించారు. ఈ సందర్భంగా కేరళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో దాదాపు 5 గంటల సేపు ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ ఈఓ లక్ష్మీశరణ్య, ట్రస్టుబోర్డు చైర్మన్ చిక్కాల నాగేశ్వరావు, ఉత్సవకమిటీ చైర్మన్ ప్రత్తి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మునగాకు పొడి సరఫరా

దేవరపల్లి: ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటున్న పిల్లల్లో రక్తహీనతను నివారించడానికి ప్రభుత్వం మునగాకు పొడిని సరఫరా చేస్తున్నట్టు దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు తెలిపారు. మండలంలోని ప్రతి ప్రభుత్వ వసతిగృహాన్ని సందర్శించి పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి మునాగాకు పొడిని అందజేస్తామని ఆయన తెలిపారు. ఇది పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన తెలిపారు.

పదో తగరతి పరీక్షలకు ఐదు కేంద్రాల ఏర్పాటు

దేవరపల్లి: ఈనెల 18 నుంచి ప్రారంభమవుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు దేవరపల్లి మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మండల విద్యాశాఖ అధికారి ఎం. తిరుమలదాస్ తెలిపారు. మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా, 1199 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. దేవరపల్లి జెడ్పీ హైస్కూలు, యర్నగూడెం జెడ్పీ హైస్కూలు, చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూలు, దేవరపల్లిలోని శ్రీచైతన్య హైస్కూలు, భాష్యం హైస్కూలులో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ఆయా కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించినట్టు ఆయన చెప్పారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

దేవరపల్లి: రబీలో పండించిన ధాన్యాన్ని కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తోందని మండల వ్యవసాయాధికారి కె.విజయ్ తెలిపారు. పంట నమోదు, ఈ-కేవైసీ కార్యక్రమాలు దాదాపు పూర్తయినట్టు ఆయన తెలిపారు. 15 రోజుల్లో త్యాజంపూడి ఆర్‌బీకే వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. మండలంలో 10 వేల ఎకరాల్లో రబీలో వరిపంట వేసినట్టు ఆయన చెప్పారు.

దళితుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నిడదవోలు: పెరవలి మండలం కానూరు గ్రామంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు సారథ్యంలో ఆదివారం జరగనున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి దళితుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు గుర్రం జేమ్స్, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు కోరారు. దీనిలో భాగంగా పట్టణంలో శనివారం చర్చిపేట, సుబ్బరాజుపేట, తీరుగూడెం, ఎంపీ నగర్, ఎన్టీఆర్ కాలనీలలో పర్యటించారు. దళితులు, దళిత పెద్దలు, యువతను కలుసుకుని దళితుల ఆత్మీయ సమ్మేళనానికి భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పిట్టా పద్మ, ఉసురుమర్తి జాన్‌బాబు దాకే అనిల్, కోఆప్షన్ సభ్యులు దిరిసిన రామచంద్రరావు, డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు గెద్దాడ విమల, విప్పర్తి కిషోర్ పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు సన్మానం

కంబాలచెరువు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులను సన్మానించారు. డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ విధులను నిర్వర్తిస్తూ, కుటుంబాన్ని ముందుకు నడిపిస్తూ మహిళలు సమాజంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు బాలమురళీకృష్ణ, బాలశౌరి, కానిస్టేబుళ్లు అర్జున్, లోవకుమార్ పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో గ్రీన్‌హౌస్

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం గ్రీన్ హౌస్ డెవలప్‌మెంట్ కార్యక్రమం చేపట్టారు. కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.సాయి సునీత, ఇండస్ట్రియలిస్ట్, సీపీడీసీ మెంబర్ జి.మణికుమార్ ఇందుకు అవసరమైన వివిధ రకాల మొక్కలను అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి మాట్లాడుతూ ఎండ తీవ్రతను తట్టుకోలేని మొక్కలను దానిలో పెంచుతామన్నారు.

ఆడపడుచులకు అండగా..



పెరవలిలో వైఎస్సార్ సున్నా వడ్డీ నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

- మహిళల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యం
- వైఎస్సార్ సున్నా వడ్డీతో మహిళలకు ఆర్థిక భరోసా
- నియోజకవర్గంలో 4990 మందికి రూ.34.34 కోట్ల లబ్ధి

పెరవలి: ప్రభుత్వం ఆడపడుచులకు అండగా నిలుస్తోంది. వారి ఆర్థిక పురోగతికి బాటలు వేస్తోంది. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం వల్ల మహిళలు తీసుకున్న రుణానికి వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పిన ముఖ్యమంత్రి అందుకు అనుగుణంగా గత నాలుగేళ్లుగా వడ్డీ సొమ్ములను లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద ఇప్పటివరకూ నాలుగేళ్లుగా రూ.34.34 కోట్లు నిధుల మహిళలకు అందించారు. దీంతో తీసుకున్న అప్పుకు వడ్డీ భారం పడకుండా ఉండడంతో పాటు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. ఇవే కాకుండా వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా ద్వారా మహిళలకు రుణాలు ఇవ్వడం, గతంలో తీసుకున్న రుణాన్ని ప్రభుత్వమే చెల్లించడంతో మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలను మోసం చేసింది. రుణ మాఫీ చేస్తానని చెప్పి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రుణ మాఫీ చేయక పోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల్లో నాలుగు విడతలుగా తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని, అలాగే సున్నా వడ్డీ అందిస్తామని హామీ ఇచ్చి, ఆ మాట ప్రకారమే గత నాలుగేళ్లుగా సున్నా వడ్డీ సకాలంలో చెల్లిస్తుండడంతో మహిళలకు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో సున్నా వడ్డీ పథకంలో 4990 మందికి రూ.34.34 కోట్లు లబ్ధి చేకూరింది. ఈ సొమ్ము నేరుగా అక్క చెల్లెమ్మలకు వారి ఖాతాల్లోకి జమ చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సున్నా వడ్డీ పథకంలో గత నాలుగేళ్లుగా పొందిన లబ్ధి

మండలం	గత నాలుగేళ్లు	లబ్ధిదారులు	సొమ్ములు
పెరవలి	2019–23	1686	12.46 కోట్లు
ఉండ్రాజవరం	2019–23	1556	10.81 కోట్లు
నిడదవోలు	2019–23	1748	11.07 కోట్లు
మొత్తం	నాలుగేళ్లు	4990	34.34 కోట్లు



ప్రభుత్వంపై నమ్మకం

వైఎస్సార్ సున్నా పథకం వలన ఆర్థిక ఇబ్బందులు తొలగడంతో పాటు ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడింది. మహిళలు ఎంత రుణం తీసుకున్నా, వడ్డీ భారం ఉండదనే ధీమా ఏర్పడింది.

– తాడి శ్యామల, డ్వాక్రా మహిళ పెరవలి



ఆర్థికంగా బలం

గత ప్రభుత్వంలో సున్నా వడ్డీ సక్రమంగా పడకపోవడంతో అనేక ఇబ్బందుల పడ్డాం. ఈ ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి లేదు, నాలుగేళ్లుగా అనుకున్న సమయానికి నిధులు అందిస్తున్నారు. దీనివల్ల ఆర్థికంగా బలపడుతున్నాం.

– మానేపల్లి రత్నకుమారి, డ్వాక్రా మహిళ పెరవలి



ప్రభుత్వమే చెల్లిస్తోంది

టీడీపీ ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తానన్నారు. కానీ చేయలేదు. దీనివల్ల తెచ్చిన అప్పుకి వడ్డీకి వడ్డీలు కట్టలేక ఎంతో ఇబ్బంది పడ్డాం. నేడు ఎంత అప్పు తీసుకున్నా వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే చెల్లిస్తోంది.

– కప్పల కుమారి, డ్వాక్రా మహిళ కాపవరం

గ్రామాల్లో 'మేము సిద్ధం మా బూత్ సిద్ధం'



ప్రక్కిలంక కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, నాయకులు

తాళ్లపూడి: మండల గ్రామాల్లో శనివారం మేము సిద్ధం మా బూత్ సిద్ధం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రక్కిలంక సచివాలయ పరిధిలోని ప్రకిలంక, పైడిమెట్ట, తాళ్లపూడి తదితర గ్రామాల్లో బూత్ కమిటీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరు శ్రీనివాస్‌ను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యాళ్ల బాబూరావు, ప్రకిలంక సచివాలయ కన్వీనర్ కొల్లి దుర్గారావు, పైడి మెట్ట బూత్ కన్వీనర్ విత్తం నాని, ప్రక్కిలంక బూత్ కన్వీనర్ రజనీ మండల జేసీఎస్ కన్వీనర్ ముళ్లపోసి బాబు, ఎంఎల్ఓ ప్రక్కిలంక వార్డ్ మెంబర్లు, వంబోలు పోశిబాబు, సిద్ధంశెట్టి కృష్ణ, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

బీసీ సదస్సుకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొవ్వూరు: చాగల్లులో నిర్వహించిన బీసీ ఆత్మీయ సదస్సుకు నియోజకవర్గం నలుమూల నుంచి భారీ ఎత్తున బీసీలు తరలివెళ్లారు. పట్టణం నుంచి బస్సులు, వివిధ వాహనాల్లో సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, బీసీ సంఘం నేతలు అక్షయ పాత్ర శ్రీనివాస రవీంద్ర, బత్తి నాగరాజు,పతివాడ రామారావు, పట్టణ పార్టీ గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, పాకా మోహనరావు, పలపాల సూర్యచంద్రరరావు, గంగాధర నాగేశ్వరరావు తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.



కొవ్వూరు నుంచి చాగల్లు బీసీ సదస్సుకు బయలుదేరుతున్న పార్టీ శ్రేణులు

వజ్రోత్సవ వేడుకలు వాయిదా

నిడదవోలు: స్థానిక పురపాలక సంఘం ఏర్పడి 60 వసంతంలోకి అడుగుపెట్టిన తరుణంలో ఈ నెల 11న నిర్వహించనున్న వజ్రోత్సవ వేడుకలను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు కృషితో పురపాలక సంఘానికి మంజూరైన సుమారు రూ.376.85 కోట్లతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పలు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ వజ్రోత్సవ వేడుకలను నిర్వహించడానికి సన్నాహాలు చేశామన్నారు. అయితే పట్టణంలో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పూర్తికానందున వజ్రోత్సవ వేడుకలను వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలు కుల, మత, రాజకీయ వర్గాలకు అతీతంగా జరుగుతాయన్నారు. ఈ అంశంలో పలువురు రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. పురపాలక సంఘ కౌన్సిల్ సభ్యుల సలహాలు, సూచనలు మేరకు భవిష్యత్తులో ఏ విధంగా వజ్రోత్సవ వేడుకలు నిర్వహించడానికి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు.



భూపతి ఆదినారాయణ

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి



వేగేశ్వరపురంలో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ, కేంద్ర సాయుధ బలగాలు



డి.ముప్పవరంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు, పోలీసులు

తాళ్లపూడి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతలకు ఇబ్బంది లేకుండా పౌరులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు అన్నారు. మండలంలోని తాళ్లపూడి, వేగేశ్వరపురం, పెద్దేవం, తిరుగుడుమెట్ట, మలకపల్లి గ్రామాల్లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ రామారావు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు (సీఆర్‌పీఎఫ్)లతో కలిసి కవాతు నిర్వహించారు. సుమారు 200 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామారావు మాట్లాడుతూ ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని అందుకు గాను వారికి భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ఎక్కడ ఏ ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే వారికి రక్షణ కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్సై టి.శ్యామ్ సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ బలగాల మార్చ్‌ఫాస్ట్

నిడదవోలు రూరల్: మండలంలోని డి.ముప్పవరం, కలవచర్ల, పెండ్యాల గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్, ఏఎస్సై పరమహంస, పోలీసులు, పారా మిలటరీ బలగాలు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

కొవ్వూరు: స్థానిక రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న పశివేదల, ఐ.పంగిడి, పెనకనమెట్ట, ధర్మవరం, తొగుమ్మి, మద్దూరు గ్రామాల్లో డీఎస్పీ కె.సీహెచ్ రామారావు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా పోలీసు కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు కోరారు. రూరల్ ఎస్సై కె.సుధాకర్, ఇతర సిబ్బందితో పాటు 150 మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

గోష్పాద క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో దీపాలు వెలిగించిన దృశ్యం

కొవ్వూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలో గోష్పాదక్షేత్రంలో శుక్రవారం అర్ధరాత్రి జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఓకారం, శివలింగాకారం, త్రి శూలం, స్వస్తిక్ ఆకారాల్లో మహిళ భక్తులు అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు దీపాలు వెలిగించి పూజాలు చేశారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



ఎంఈఓ-2 భగవతిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నల్లజర్ల: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు కె.కృష్ణవేణి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి యస్.భవానీ మాట్లాడుతూ మహిళలు సాధించని రంగం అంటూ ఏదీ లేదన్నారు. అయినా మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతుందన్నారు. దానిని మనం రూపుమాపాలన్నారు. ఎంఈఓ-2 భగవతిని మహిళా ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు వెంకటలక్ష్మి, కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, ఉపాధ్యాయులు వరలక్ష్మి, శశికళ, జయలక్ష్మి, నిర్మల, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

సీటీఆర్ఐ: శ్రీ ఉమా మార్కండేయేశ్వరస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించా రు. స్వామి, పార్వతీ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. .

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

కడియం: రాష్ట్రంలో ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని వేమగిరి గట్టు, జక్కంపూడి నగర్ ప్రాంతాల్లో రూ.87.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కాలుష్య రహిత పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛత – మన బాధ్యత కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆ దిశగా ప్రభుత్వ యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని మంత్రి వేణు అన్నారు. ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని 19వ డివిజన్ కొండావారి వీధి నుంచి స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

19వ డివిజన్‌లో గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో సుమారు వంద మంది మహిళలు,యువత వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. 16వ డివిజన్ బాలాజీ పేట సెంటర్‌లో గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో 200 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన పాప్పి, అంజిబాబు, గోపి, కర్రి రాజేష్, జయలక్ష్మి, ఈపి శివగౌరి, సూరిబాబు, నాని తదితరులుకు మంత్రి వేణు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ తదితరులు

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

కడియం: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియం మండలం పరిధిలోని లబ్ధిదారులకు శనివారం వైఎస్సార్ చేయూత నమూనా చెక్కును పంపిణీ చేశారు. మండలంలో 4,154 మందికి రూ.7,78,87,500 జమ చేయడం జరిగిందన్నారు. మొత్తం నాలుగు విడతలుగా 15,444 మందికి రూ.28.86 కోట్లు అందించామని తెలిపారు.

అక్కచెల్లెమ్మలకు భరోసా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా కల్పించారని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. నగరపాలకసంస్థలోని రూరల్ నియోజకవర్గ డివిజన్ల పరిధిలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమాన్ని ఇన్నీసుపేట బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ 16 సచివాలయాల పరిధి లోని 2,284 మంది లబ్ధిదారులకు రూ.428.25 లక్షలను వైఎస్సార్ చేయూత పథకం కింద వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



అన్నవరప్పాడులో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాలపూలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి స్వామివారికి పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాస రెడ్డి స్వర్ణ, సాయి మనోహర్ రెడ్డి, సత్యసమీరా దంపతుల చేతుల మీదుగా ప్రారంభించగా 8 వేల మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

ఘనంగా రుద్రాభిషేకం



ఉండ్రాజవరంలో గోకర్ణేశ్వర స్వామిని అభిషేకం చేస్తున్న చంద్రశేఖర సరస్వతి సేవాసమితి సభ్యులు

ఉండ్రాజవరం: మహాశివరాత్రి సందర్భంగా ఉండ్రాజవరంలో బాలత్రిపుర సుందరీ, గోకర్ణేశ్వర స్వామి వారికి శుక్రవారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. చంద్రశేఖర సరస్వతి స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం 11 రకాల ద్రవ్యలతో స్వామివారికి అభిషేకం జరిగింది. కార్యక్రమంలో శ్రీచంద్రశేఖర సరస్వతి సేవా సమితి సభ్యులు ఆకెళ్ల శ్రీనివాసరావు, దోనేపూడి సుధాకర్, ఇ.సత్యకృష్ణ, కె.సత్యనారాయణ, దోనేపూడి శ్రీరామ్‌పవన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాల పంపిణీ



పురోహితులకు పట్టువస్త్రాలు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ జన్మదినం సందర్భంగా ఆయన కుమారుడు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శనివారం ఇన్నీసుపేటలోని మహాకాళేశ్వరీ సమేత మహాకాళేశ్వరాలయంలో పురోహితులకు పట్టువస్త్రాలు పంపిణీ చేశారు. అలాగే 36వ డివిజన్‌లో నివసిస్తున్న సతీష్ అనే దివ్యాంగుడికి ట్రైసైకిల్ పంపిణీ చేశారు.

గోరంట్ల దిష్టిబొమ్మ దహనం

కడియం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. స్థానిక దేవీచౌక్ సెంటర్‌లో రూరల్ బీసీ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బుచ్చయ్య వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. బీసీ నాయకులు పాల్గొన్నారు.